సాక్షి పల్నాడు

బుధవారం । 20 । మార్చి । 2024



కాళీమాత తిరునాళ్ల

ఫిరంగిపురం: మేరికపూడిలోని కాళీమాత ఆలయ తిరునాళ్ల మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి అర్చకులు విశేష పూజలు చేశారు.



బాబా ఆలయ వార్షికోత్సవం

యడ్లపాడు: కొత్తసొలనలోని గణపతి దత్తాత్రేయ సమేత షిరిడీ సాయిబాబా ఆలయ 16వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త కుప్పస్వామి తెలిపారు.



పరీక్ష కేంద్రాలు తనిఖీ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎస్ఎస్‌సీ పరీక్షల రాష్ట్ర పరిశీలకురాలు పి.పార్వతి మంగళవారం తనిఖీ చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహరి (గురు)
నరసరావుపేట	6.26	4.57
గుంటూరు	6.24	4.55
బాపట్ల	6.24	4.55

టీడీపీపై కాపులు కస్సుబుస్సు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి గుంటూరు జిల్లాలో కాపులకు పెద్దపీట వేశారు. గుంటూరు పార్లమెంట్ స్థానంతోపాటు పొన్నూరు, చిలకలూరిపేట, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాలను కేటాయించారు. ఆ వర్గం పట్ల తనకున్న ప్రేమను చాటారు. కానీ తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలను తన సామాజిక వర్గానికి కేటాయించింది. కాపులకు ఒక్క అసెంబ్లీ స్థానం మాత్రమే కేటాయించి ఆ వర్గంపై తనకున్న చిన్నచూపును చెప్పకనే చెప్పింది. దీంతో కాపు వర్గీయులు టీడీపీ వైఖరిపై భగ్గుమంటున్నారు.

- గుంటూరు జిల్లాలో నిండా మునిగిన కాపులు
- ఒక్కటంటే ఒక్క సీటుతో సరిపెట్టారు
- సీట్లన్నీ కమ్మ సామాజికవర్గానికే...
- ఎనిమిది ఎమ్మెల్యే, రెండు ఎంపీలు వాళ్లకే...
- టీడీపీ అభ్యర్థులను ఓడించి తీరతామని అల్టిమేటం
- మరోవైపు వైఎస్సార్ సీపీలో సింహభాగం సీట్లు కాపులకే
- వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామంటున్న కాపులు

సాక్షి ప్రతినిధి,గుంటూరు : ఉమ్మడి గుంటూరు జిల్లాలో కాపులు తెలుగుదేశంపై భగ్గుమంటున్నారు. కాపులు నాయకులుగా కాదు తమకు సేవకులుగా మాత్రమే కావాలి అని టీడీపీ పరోక్షంగా సంకేతాలు ఇచ్చింది. పవన్‌కల్యాణ్ ఒక్కడిని తమ కాంపౌండ్‌లో ఉంచుకుంటే చాలు.. ఇక కాపులతో పనే లేదని టీడీపీ చెప్పకనే చెప్పింది. గుంటూరు పార్లమెంటులో కాపు సామాజిక వర్గానికి పూర్తిగా మొండిచేయి చూపించింది. ఒక్కటంటే ఒక్క సీటు కూడా కేటాయించకుండా కాపులను వెక్కిరించింది. నరసరావుపేట పార్లమెంట్‌లో తప్పని పరిస్థితిలో ఒకరికి కేటాయించింది. తన సామాజిక వర్గానికి మాత్రం అగ్రతాంబూలం దక్కింది. రెండు ఎంపీలు, ఎనిమిది అసెంబ్లీ ఆ వర్గానికి కేటాయించారు. తెలుగుదేశం పార్టీలో కాపులకు గతంలో కూడా చాలా అవమానాలు ఎదురయ్యాయి. చివరి వరకూ వారితో ఖర్చు పెట్టించి ఎన్నికల సమయానికి మొండిచేయి చూపడం ఆనవాయితీగా మారింది. కాపు సామాజికవర్గం నుంచి డేగల ప్రభాకర్, దాసరి రాజా మాస్టారు, చందు సాంబశివరావు వంటి వారిని వాడుకుని వదిలేసింది. ఇప్పటివరకు సహనంతో ఉన్న ఆ సామాజిక వర్గ నాయకులు ఈసారి మాత్రం తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. తమను ఘోరంగా అవమానించిన తెలుగుదేశంపార్టీకి గట్టిగా బుద్ధి చెప్పేందుకు సమాయత్తమవుతున్నారు.

తెనాలి పర్యటనలో ఎంపీ అభ్యర్థి పెమ్మసానిని అడ్డుకున్న వైనం



వైఎస్సార్ సీపీలో కాపులకు అత్యంత ప్రాధాన్యం

మరో వైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే తీసుకుంటే... కాపుల ఆత్మ గౌరవం నిలబెట్టేలా పార్టీ ప్రవర్తించింది. కాపులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి వారిని అక్కున చేర్చుకుంది. ఏకంగా గుంటూరు పార్లమెంటుతోపాటు పొన్నూరు అసెంబ్లీ కూడా కాపులకే ఇచ్చింది. గుంటూరు పార్లమెంట్ పరిధిలో వైఎస్సార్ సీపీ ఎంపీ సీటును, పొన్నూరు ఎమ్మెల్యే సీటును కాపులకు కేటాయించింది. రెండు ఎస్సీ సీట్లను మినహాయిస్తే మిగిలిన నాలుగు సీట్లలో రెండు బీసీ, ఒకటి మైనారిటీ, ఒకటి కమ్మ సామాజిక వర్గానికి కేటాయించింది. గుంటూరు ఎంపీ సమన్వయకర్తగా కిలారు రోశయ్య, పొన్నూరు సమన్వయకర్తగా అంబటి మురళీకృష్ణను నియమించగా, బీసీ సామాజిక వర్గానికి చెందిన విడదల రజినిని గుంటూరు పశ్చిమలో, మంగళగిరిలో చేనేత సామాజిక వర్గానికి చెందిన మురుగుడు లావణ్య, గుంటూరు తూర్పులో మైనారిటీలకు సంబంధించి నూరి ఫాతిమాను నియమించారు. ఏడు సీట్లలో ఏకంగా నలుగురు మహిళలకు వైఎస్సార్‌సీపీ సీట్లు కేటాయించింది. గుంటూరు పార్లమెంట్, పొన్నూరు– కాపులు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కూడా కాపు నేపథ్యం ఉన్నవారికే కేటాయించడంతో ఆ సామాజిక వర్గం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పల్నాడులో రెండు స్థానాలు కాపులకే..

నరసరావు పార్లమెంట్ విషయానికి వస్తే సత్తెనపల్లి మంత్రి అంబటి రాంబాబుకు, చిలకలూరిపేట కూడా కాపు సామాజికవర్గానికే చెందిన కావటి మనోహర్‌నాయుడికి కేటాయించారు. జిల్లాలో కీలకమైన డీసీసీబీ చైర్మన్ కూడా కాపు కులానికి చెందిన లాల్‌పురం రాముకే కేటాయించి కాపులకు పెద్దపీట వేశారు. బీసీలకు, మిగిలిన వర్గాలకు కూడా సమన్యాయం పాటించారు. నరసరావుపేట పార్లమెంట్ టికెట్‌ను యాదవ సామాజిక వర్గానికి చెందిన అనిల్‌కుమార్ యాదవ్‌కు కేటాయించారు

ఆ సామాజిక వర్గానికే పెద్దపీట

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు.. అన్నట్లు గుంటూరు పార్లమెంటులో అన్ని స్థానాలను సొంత సామాజిక వర్గానికే టీడీపీ కేటాయించింది. ప్రత్తిపాడు, తాడికొండ రిజర్వుడు స్థానాలు, గుంటూరు తూర్పు ముస్లింలకు ప్రాధాన్యం ఉన్నవి మినహాయిస్తే మిగిలిన నాలుగు అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు కమ్మ సామాజికవర్గం, ఆ సామాజికవర్గ నేపథ్యం ఉన్న వారికే ఇచ్చి టీడీపీ మరోసారి తన సామాజికవర్గంపై తన అవిభాజ్య ప్రేమను కనబరిచింది. కాపులకు ఒక్కటంటే ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ఘోరంగా అవమానించింది. మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ స్థానాలతోపాటు గుంటూరు పార్లమెంటు స్థానాన్ని తన సామాజికవర్గానికే కేటాయించడం చూసి కాపు నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గమైనా కాపులకు కేటాయిస్తారని ఎదురుచూడగా.. ఆ అవకాశం కూడా ఇవ్వకుండా తన సామాజికవర్గానికి చెందిన గల్లా రామచంద్రరావు భార్య మాధవికి కేటాయించింది. ఈ పరిణామం పుండు మీద కారం చల్లినట్లుగా మారింది. నరసరావుపేట పార్లమెంట్‌లో కూడా నాలుగు సీట్లు తన సామాజిక వర్గానికే కేటాయించింది. భాష్యం ప్రవీణ్, యరపతినేని శ్రీనివాసరావు, జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావుతోపాటు ఎంపీ స్థానం కూడా అదే సామాజికవర్గానికి చెందిన లావు శ్రీకృష్ణదేవరాయలుకు కేటాయించింది. ఒకటి రెడ్డి, మరొకటి కాపులకు కేటాయించిన టీడీపీ సరైన అభ్యర్థి దొరకక నరసరావుపేట పెండింగ్‌లో పెట్టింది.

టీడీపీకి బుద్ధి చెబుతాం

టీడీపీ రెండో జాబితా ప్రకటించాక ఆ పార్టీలోని కాపు నాయకుల్లో అసంతృప్తి జ్వాలలు పెద్దఎత్తున ఎగసిపడుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెప్పి తీరతామని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా టీడీపీ గుంటూరు సిటీలో ఏదో ఒక సీటు కేటాయిస్తుందని కాపులు ఆశలు పెట్టుకున్నారు. వెస్ట్ టికెట్ కూడా కమ్మ సామాజికవర్గం నేపథ్యం ఉన్న వారికే ఇవ్వడంతో కాపులు రగిలిపోతున్నారు. ఎలా గెలుస్తారో చూస్తామని శపథం పట్టారు. పార్టీకి సేవ చేయడానికి మాత్రమే కాపులు కావాలా.. అంటూ మండిపడుతున్నారు. చంద్రబాబు పాలనలో కాపులను అణగదొక్కడమే పనిగా పెట్టుకున్నారని, రెండు మూడు రోజుల్లో తమతో చర్చలు జరిపి కాపు అభ్యర్థికి సీటు కేటాయించకపోతే ప్రతి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులను నిలబెడతామని కాపు జేఏసీ నాయకులు అల్టిమేటం ఇచ్చారు. కాపుల ఓట్లు మీకు అవసరం లేదా? కాపులకు సీట్లు ఇవ్వమని అడుగుతుంటే జనసేన ఉంది కదా అంటున్నారని, జనసేన కూడా కమ్మ అభ్యర్థినే నిలబెట్టిందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు తూర్పు నుంచి నగర అధ్యక్షునిగా ఉన్న డేగల ప్రభాకర్‌కు సీటు వస్తుందని ఆశించినా అతనికి ఇవ్వకపోవడంతో కాపు వర్గం ఆగ్రహంగా ఉంది. గురువారం తెనాలి పర్యటనలో ఉన్న ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను అడ్డుకుని అల్టిమేటం ఇచ్చారు.

న్యూస్‌రీల్

ఏప్రిల్‌లో టెక్నో కల్చరల్ ఫెస్ట్



గుంటూరు ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేందుకు ఏప్రిల్ 3,4వ తేదీల్లో జాతీయస్థాయిలో టెక్నో కల్చరల్ ఫెస్ట్–2024 నిర్వహిస్తున్నట్లు హిందూ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఐజక్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం అమరావతి రోడ్డులోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో టెక్నో ఫెస్ట్ పోస్టర్లను కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ సూదా కృష్ణార్జునరావుతో కలిసి ఆవిష్కరించారు. టెక్నోఫెస్ట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి గల విద్యార్థులు కళాశాల వెబ్‌సైట్‌లో ఈనెల 31లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 83329 11155, 83320 11155 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

24న ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల



యడ్లపాడు: బోయపాలెం –చెంఘీజ్‌ఖాన్‌పేట నడుమ సంగంగోపాలపురం వద్ద పూలలొద్ది యందు వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయస్వామి 40వ తిరునాళ్ల మహోత్సవం ఈనెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నందున వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను నిర్వాహణ కమిటీ కల్పిస్తుందన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు అదేరోజు ఉదయం 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. రాత్రికి చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు తరలి వస్తాయన్నారు. కొండ దిగువ నుంచి పైన ఆలయం వరకు విద్యుత్ దీపాల అలంకరణతో పాటు కోలాటాలు, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

వైద్య ఉద్యోగుల గ్రీవెన్స్



గుంటూరు మెడికల్ : రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ ఆదేశాల మేరకు మంగళవారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్య ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, వైద్య ఉద్యోగుల సంఘాల నేతల నుంచి వేతన సంబంధిత సమస్యలపై 70 అర్జీలు వచ్చాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి చెప్పారు. వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అభ్యర్థుల వినతి పత్రాలను కమిషనర్ కార్యాలయం డైరెక్టర్‌కు పంపిస్తామని వెల్లడించారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల్లో విస్తృత తనిఖీలు

ద్వితీయ భాష పరీక్షకు 97.31 శాతం హాజరు

గుంటూరు ఎడ్యుకేషన్: పదవ తరగతి ద్వితీయ భాషా పరీక్షకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా 97.31 శాతం హాజరు నమోదైంది. జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గుంటూరు నగరంలోని వివిధ పరీక్ష కేంద్రాలను విస్తృతంగా తనిఖీ చేశారు. స్తంభాలగరువు, పట్టాభిపురంలోని నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలతో పాటు శ్యామలానగర్‌లోని శ్రీచైతన్య, రవీంద్రనగర్‌లోని భాష్యం, భారత్‌పేటలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్ ఏ, బీ సెంటర్లు, నగరాలులోని నవీన హైస్కూల్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్, శ్రీచైతన్య పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 147 కేంద్రాల్లో కేటాయించిన 27,721 మంది విద్యార్థుల్లో 26,978 మంది హాజరయ్యారు.

ప్రవీణ్‌కు అసంతృప్తి సెగలు

- సముచిత స్థానం ఇవ్వడం లేదంటూ మిత్రపక్షాల ఆగ్రహం
- సమావేశం నుంచి వెళ్లిపోయిన జనసేన కార్యకర్తలు
- బీజేపీ నాయకులను దూరం పెడుతున్న వైనం
- ఇప్పటికే సహకరించని శ్రీధర్ వర్గం
- తాయిలాలతో మచ్చిక చేసుకొనే ప్రయత్నంలో భాష్యం



పెదకూరపాడులో నిర్వహించిన సమావేశంలో కనిపించని జనసైనికులు

పెదకూరపాడు: జనసేన, బీజేపీ మద్దతుతో పెదకూరపాడు నుంచి బరిలో నిలిచిన టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌కు తలనొప్పులు తప్పడం లేదు. సొంత పార్టీలోని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌తోపాటు మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ కార్యకర్తలు సహాయ నిరాకరణ చేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు భాష్యం ప్రవీణ్‌ను అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో మండల స్థాయిలో టీడీపీ, జనసేన, బీజేపీల గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జిలు, మండలంలోని రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు, ఇతర ముఖ్య నాయకులతో సోమవారం సాయంత్రం క్రోసూరులో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి జనసేన నుంచి 50 మంది కార్యకర్తలు హాజరయ్యారు. వారికి టీడీపీ నేతలు సముచిత స్థానం కల్పించలేదు. దీంతో జనసేన నాయకులు, కార్యకర్తలు సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఫ్లెక్సీలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఫొటో లేదని, కనీసం జనసేన నాయకులను వేదిక మీదకు పిలువలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొత్తు ధర్మం ఇదేనా...? ఇలా చేస్తారా...? కూటమిలో మీరే కుంపటి పెడతారా...? అంటూ తమ ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన నాయకులు సమావేశం నిర్వహించి మంగళవారం పెదకూరపాడు, అమరావతి మండలాల్లో జరిగే పార్టీ విస్తృత స్థాయి సమావేశాలను బహిష్కరించాలని తీర్మానించారు. పెదకూరపాడులో సాయి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశానికి జనసేన నాయకులు హాజరుకాలేదు.

బీజేపీ నేతలు దుమ్మా

బీజేపీ నేతలు కూడా సమావేశానికి హాజరుకాలేదు. ముస్లిం ఓట్లు పోతాయన్న భావనలో బీజేపీ నాయకులను పక్కనపెడుతున్నారని, అలాంటి ఆలోచన ఉంటే పొత్తు ఎందుకు పెట్టుకున్నారంటూ కమలం పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మించింది లేదని పొత్తు అవసరం లేకపోతే జనసేనతో కలిసి విడిగా పోటీ చేస్తామని వారు తెగేసి చెబుతున్నారు.

సహకరించని శ్రీధర్ వర్గం

మిత్రపక్ష పార్టీలతో ఇబ్బంది పడుతున్న ప్రవీణ్‌కు సొంత పార్టీలోని శ్రీధర్ వర్గంతోనూ తిప్పలు తప్పడం లేదు. పెదకూరపాడు టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఇప్పటికీ భాష్యం ప్రవీణ్‌కు పూర్తిగా సహకరించడం లేదు. అంటీముంటనట్టు వ్యవహరిస్తున్నారు. తప్పదన్నట్టు కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. దీంతో భాష్యం ప్రవీణ్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పార్టీకి దూరంగా ఉన్న నేతలు, కార్యకర్తల జాబితాలను గ్రామాల వారీగా సేకరించేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసుకున్నారు. వారి ద్వారా నేతలను కలసి తాయిలాలు ఇచ్చి బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. దారికి రాని వారిని చినబాబు వద్దకు తీసుకువెళ్లి మాట్లాడించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జనసేన, బీజేపీ నేతలకు వారి వారి స్థాయిని బట్టి నగదు ఆశచూపి దారిలోకి తెచ్చుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కూటమిలో కుంపటి ఎంత వరకు దారి తీస్తుందో అనే అనుమానంతో టీడీపీ కేడర్ ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఆశీర్వదించండి



లోక్‌సభ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బొల్లాను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

- వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్
- వినుకొండ రూరల్ మండలంలో ఎమ్మెల్యే బొల్లాతో కలసి ప్రచారం
- గ్రామాల్లో బ్రహ్మరథం పట్టిన అభిమానులు, కార్యకర్తలు

వినుకొండ (నూజెండ్ల): ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేసిన ప్రభుత్వం కావాలో? హామీలు ఇచ్చి అమలు చేయని ప్రభుత్వం కావాలో ప్రజలు ఆలోచన చేయాలని వైఎస్సార్ సీపీ నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి వినుకొండ రూరల్ మండలం కొటప్పనగర్ గ్రామం మీదుగా పెదకంచెర్ల, ఏనుగుపాలెం, పిట్టంబండ, ఉమ్మడివరం, నాగులవరం, గోకనకొండ గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. అనిల్‌కుమార్ యాదవ్ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుల గజమాలతో స్వాగతం పలికారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు ఇచ్చిన హామీలన్ని అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. 14ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు 600 హామీలు ఇచ్చి, అమలు చేయలేకపోయాడని విమర్శించారు. మీ ఇంటిలో మంచి జరిగిందనుకుంటేనే తమను ఆశీర్వదించి, ధైర్యంగా తమ ఓటు అనే ఆయుధంతో ఎక్కువ మెజారిటీతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరలా పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ఒంటరిగా గెలవలేక జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకొని మరోమారు ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యాడని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఎవరిని ఏమి అడగాలో అర్థం కాని పరిస్థితులు నెలకొంటాయన్నారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు, పార్లమెంటు అభ్యర్థి అయిన తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామని, ప్రజల ఆశీర్వాదం ఉంటే రానున్న రోజులలో వినుకొండను రాష్ట్రంలోనే పేరున్న నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. నారా చంద్రబాబు లోకేష్ ఆదేశాలతోనే గ్రామాల్లో అల్లర్లు, గొడవలు సృష్టించేందుకు టీడీపీ నాయకులు సిద్ధమయ్యారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. టీడీపీ గెలిపిస్తే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని హెచ్చరించారు. టీడీపీ బెదిరింపులకు వైఎస్సార్ సీపీ నాయకులు బెదిరేదిలేదని, కార్యకర్తలకు తాము అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభకు హాజరైన ప్రజలు

విద్యార్థిని ప్రియాంకబాయికి ఊరట


- ఆ విద్యార్థినికి ప్రత్యేకంగా తెలుగు పరీక్ష నిర్వహిస్తాం
- విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్ణయం
- దరఖాస్తు సమయంలో తెలుగుకు బదులు హిందీ నమోదు
- హిందీ పరీక్ష రాసిన విద్యార్థిని



మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారులు

కారెంపూడి: దరఖాస్తు చేసే సమయంలో ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగుకు బదులు హిందీ అని పొరపాటున రాసిన పదో తరగతి విద్యార్థిని సోమవారం జరిగిన తెలుగు పరీక్ష రోజున హిందీ పరీక్ష రాయాల్సి వచ్చిన ఘటనపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఆ విద్యార్థినికి ఈనెల 31న ప్రత్యేకంగా తెలుగు పరీక్ష నిర్వహించాలని ఆదేశాలిచ్చారని కారెంపూడి–1, కారెంపూడి–2 ఎంఈఓలు కాంతారావు, రవికుమార్‌లు మంగళవారం వెల్లడించారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం 10వ తరగతి విద్యార్థిని ప్రియాంకభాయి స్థానిక మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో అందరిలా తెలుగు పరీక్ష రాసేందుకు సిద్ధమై వెళ్లింది. కానీ ఆ విద్యార్థినికి మాత్రం దరఖాస్తులో పేర్కొన్న ప్రకారం పై నుంచి హిందీ పేపర్ వచ్చింది. ఇన్విజిలేటర్ కూడా చేసేదేమీలేక దానినే ఇచ్చి పరీక్ష రాయమన్నారు. ఇన్విజిలేటర్ ఇచ్చిన సమాచారాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు విచారించి విద్యార్థినికి న్యాయం చేశారని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ బోర్డు డైరెక్టర్ దేవానందరెడ్డి, ఆర్జేడీ బి లింగేశ్వరరెడ్డి ఈ మేరకు డీఈఓ వెంకటేశ్వర్లుకు ఆ పాప తెలుగు పరీక్ష ప్రత్యేకంగా ఈనెల 31న రాసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలిచ్చారని మండల విద్యాశాఖ అధికారులు చెప్పారు. ఉన్నతాధికారుల నిర్ణయంతో విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు ఇతరులంతా కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిని దరఖాస్తు పూర్తి చేసే సమయంలో దొర్లిన తప్పు వల్ల ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్ణయంతో ఆ విద్యార్థిని ఊపిరిపీల్చుకుంది. ఉన్నతాధికారుల నిర్ణయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



ఏఎన్‌యూ: డాక్టర్ వైఎస్ఆర్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను మంగళవారం వీసీ ఆచార్య పి రాజశేఖర్ ఆవిష్కరించారు. సదస్సు డైరెక్టర్ పి నిహారిక మాట్లాడుతూ 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్' అనే అంశంపై ఈనెల 21, 22 తేదీలలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి సిద్ధయ్య, విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ వరలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ చైతన్య, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండో రోజు కొనసాగిన పదో తరగతి పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పల్నాడు జిల్లా వ్యాప్తంగా 127 పరీక్ష కేంద్రాలలో పరీక్ష నిర్వహిస్తున్నారు. రెండో రోజు మంగళవారం నిర్వహించిన సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 25, 525మంది విద్యార్థులకు గాను 25,015మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ హుస్సేన్, డెప్యూటీ డీఈఓలు కె.వేణుగోపాలరావు(నరసరావుపేట), వి.వెంకటేశ్వరరావు(సత్తెనపల్లి) పరీక్షల నిర్వహణ విధులలో పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

ముప్పాళ్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు.

ఓటర్లకు బహుమతులు ఇస్తే చర్యలు

పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగజ్యోతి

పాత గుంటూరు: 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా బహుమతులు, తాయిలాలు పంపిణీ చేసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పన్నుల జాయింట్ కమిషనర్ నాగజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఎవరైనా ఓటర్లకు బహుమతులు అందిస్తున్నారనే సమాచారం ప్రజల దృష్టికి వస్తే వెంటనే పన్నుల శాఖకు చెందిన 9154970445కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు చేయాలని జాయింట్ కమిషనర్ తెలిపారు.

లారీ ఢీకొని.. గొర్రెల కాపరి మృతి

బల్లికురవ: గొర్రెలను పొలం మేతకు తోలుకుని వెళ్లి తిరిగి గ్రామంలోకి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టటంతో మూడు గొర్రెలు, కాపరి అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి అద్దంకి–బల్లికురవ ఆర్అండ్బీ రోడ్డులోని మండలంలోని వల్లాపల్లి బస్‌స్టాప్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన వెంపరాల పున్నయ్య(61) సుమారు 40 గొర్రెలు మేపుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామానికి పడమర వైపు ఉన్న పొలాలకు మేతకు తోలుకెళ్లి గ్రామంలోకి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అద్దంకి నుంచి బల్లికురవ వైపు వస్తున్న లారీ గొర్రెల మందను, పున్నయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మూడు గొర్రెలు, కాపరి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి భార్య హనుమాయమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహాలు అయ్యాయి.

ఎన్నికల నిబంధనలపై తక్షణమే స్పందించాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో తక్షణమే స్పందించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎన్నికల నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో రాజకీయ నాయకుల పోస్టులను తొలగించాలని ఆదేశించారు. సీ–విజిల్ యాప్ పని విధానాన్ని పరిశీలించారు. యాప్‌లో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని, సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల ఫారాల క్లెయిమ్‌లు సకాలంలో పరిష్కరించాలని కోరారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రదేశాలలో అవసరమైన చర్యలు చేపట్టాలని వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీములకు జీపీఎస్ అనుసంధానం జరిగిందని వివరించారు. అదే విధంగా చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వీరే..!

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఎన్నికల రిటర్నింగ్ అధికారులను (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులను(ఏఈఆర్వోలు) రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించింది. నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా(ఆర్వో) జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఏఈఆర్వోలుగా ఆయా మండలాల తహసీల్దార్లు, పట్టణాల మున్సిపల్ కమిషనర్లు వ్యవహరించనున్నారు. ఆర్వోల పర్యవేక్షణలో ఏఈఆర్ఓలు పని చేస్తారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించే వరకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి, కోడ్ ఉల్లంఘనలు, ఓటర్లకు ప్రలోభాలు .. నియమావళికి విరుద్ధంగా పార్టీల ప్రచారం, అభ్యర్థుల ఖర్చు, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ, బ్యాలెట్ పేపర్ల తయారీ, కౌంటింగ్ వంటి కీలకమైన బాధ్యతలు రిటర్నింగ్ అధికారుల సమక్షంలోనే నిర్వహిస్తారు. జిల్లాలో నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వీరే..


నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి	సెల్ నంబర్
పార్లమెంట్(నరసరావుపేట)	శివశంకర్ లోతేటి, కలెక్టర్	91549 59301
మాచర్ల	శ్యాంప్రసాద్, జిల్లా సంయుక్త కలెక్టర్	91549 59302
నరసరావుపేట	పి.సరోజని, ఆర్డీఓ	98491 50077
చిలకలూరిపేట	నారదముని, డెప్యూటీ కలెక్టర్	96523 44669
సత్తెనపల్లి	వి.మురళీకృష్ణ, ఆర్డీఓ	91549 59294
పెదకూరపాడు	కందుల శ్రీరాములు, పులిచింతల స్పెషల్ డెప్యూటీ కలెక్టర్	85004 08235
వినుకొండ	వరద సుబ్బారావు, పులిచింతల స్పెషల్ డెప్యూటీ కలెక్టర్	90100 87775
గురజాల	జీవీ రమణాకాంత్‌రెడ్డి, ఆర్డీఓ	98499 04015

లంచంగా తీసుకున్న డబ్బులిచ్చేశారు..

- గతంలో సబ్సిడీ రుణాల పేరుతో వసూలు
- టీడీపీ నాయకుల ఘనకార్యం
- ఆగ్రహంగా ముస్లింలు
- పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక

అమరావతి: టీడీపీ నాయకులకు ముస్లింలు బుద్ధి చెప్పారు. గతంలో ముస్లిం మైనారిటీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయిస్తామని నమ్మబలికి లంచాలు దండుకున్నారు. అవినీతి రహితంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. దీంతో రెండు రోజుల్లో అనేక కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిపోయాయి. టీడీపీ నాయకులు దిద్దుబాటు చర్యలకు దిగారు.

వివరాలు.. 2018లో యాభైశాతం సబ్సిడీతో రెండు లక్షల చొప్పున మైనార్టీ కార్పొరేషన్‌లో రుణాలు మంజూరు చేయిస్తానని నమ్మబలికిన స్థానిక మైనార్టీ నాయకుడు 120 మంది దగ్గర నుంచి సుమారు నాలుగు లక్షల రూపాయలు దండుకున్నాడు. అందులో 40 మంది దగ్గర నుంచి ఐదు వేల చొప్పున మరో 80 మంది వద్ద రూ.2,500 చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. సబ్సిడీతో కూడిన మైనార్టీ లోన్‌ల కోసం వసూలు చేసిన సొమ్ము తిరిగి ఇవ్వకపోవటంతో ముస్లింలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. దీంతో సోమ, మంగళవారాలలో నియోజకవర్గ నాయకులు పంపించిన సొమ్మును గతంలో డబ్బు ఇచ్చిన వారందరికి వెంటనే చెల్లింపులు చేశారు. టీడీపీ నాయకులు లంచం డబ్బులు చెల్లిస్తూ టీడీపీకి ఓటు వేయాలని అడిగితే మా డబ్బులు మాకిచ్చి ఓటువేయమంటే ఎలా వేస్తాం అని చెప్పినట్లు సమాచారం. ఈనేపథ్యంలో 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమరావతిలో ముస్లింలకు 180 ఇళ్ల స్థలాలు, కుట్టు మిషన్లు 300 మందికి 10 వేల సాయం, పింఛన్‌లు, చేయూత ఇలా ప్రభుత్వ పథకాలను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీలకతీతంగా అందించటంతో కాలనీ వాసులు అత్యధికంగా వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గుచూపుతుండటంతో టీడీపీ నాయకత్వం తాయిలాల పంపిణీ ప్రారంభించింది.



విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటా

- జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటానని, ఏ ఇబ్బంది ఉన్నా ఆదుకుంటామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆత్మీయ సమావేశంలో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి సంఘం అధ్యక్షుడు బొడ్డు రామరావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు ఈ ప్రభుత్వం అండగా నిలిచిందని చెప్పారు. దౌర్జన్యాలు, రౌడీయిజాన్ని అణచివేశామని వెల్లడించారు. పెద్దలుగా ఈ సుపరిపాలను పది మందికి తెలియజేయాలని కోరారు. పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల భవనం సమస్యలలో ఉండగా ఆ సమస్యను పరిష్కరించేందుకు సహకరించిన మంత్రి అంబటి రాంబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ సభ్యులంతా సహకరిస్తామని తెలిపారు. ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరి బాబు, పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, దూళ్లిపాళ్ల ది ఆంధ్రా బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్ తోట లక్ష్మీనారాయణ, ఈపూరి బ్రహ్మారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి రొంపిచర్ల పురుషోత్తం, అసోసియేషన్ నాయకులు కెబీఆర్‌జే ప్రసాద్, జక్కుల లక్ష్మీనారాయణ, కె.పోతులూరయ్య, బీడీఆర్ వెంకటేశ్వరరావు, గద్దె మురహరిరావు, రంగారెడ్డి, ఎమ్‌జే. నాయుడు, సత్తెనపల్లి సైదులు, జెట్టి సైదులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే ఎన్నికలు విజయవంతం

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: సాధారణ ఎన్నికల నిర్వహణ బాధ్యతలను అందరూ సమష్టిగా నిర్వహిస్తే ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగించవచ్చని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎలక్షన్ కోఆర్డినేషన్ సెక్షన్, లీగల్ సెల్, మీడియా సర్టిఫికెట్ అండ్ మానటరింగ్ కమిటీ విభాగం, డీఆర్సీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలను మంగళవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు క్లియర్ చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులను, ఇబ్బందికర పరిస్థితులను ఒత్తిడి లేకుండా పరిష్కరించుకోవాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారికి ప్రతిరోజూ సమర్పించాల్సిన నివేదికలను ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వివరించారు. డీఆర్వో పెద్ది రోజా, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి రఘు, కమిటీ నోడల్ అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

రేపల్లె రూరల్: రేపల్లె బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూలు విడుదల చేసినట్లు ఎలక్షన్ ఆఫీసర్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21, 22వ తేదీలలో నామినేషన్‌ల దాఖలు, 23న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, 28వ తేదీన ఎన్నిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు అనంతరం గెలుపొందిన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం బార్ అసోసియేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి

జేసీ శ్యాంప్రసాద్



దుర్గిలో పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులతో మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

దుర్గి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. మండలంలో మంగళవారం విస్తృతంగా పర్యటించి వసతులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలని, బహిరంగ ప్రదేశాలలో పార్టీలకు చెందిన బ్యానర్లు, నాయకుల విగ్రహాలు ప్రజలకు కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, జీపీఎస్ అనుసంధానం పూర్తయిందని చెప్పారు. ఈఆర్ఓలు, బీఎల్ఓలు సక్రమంగా విధులు నిర్వహించాలని కోరారు. మండలంలో అడిగొప్పల, ఓబులేశునిపల్లె, దుర్గి, ధర్మవరం, జంగమహేశ్వరపాడు, ముటుకూరు, కంచరగుంట, కోలగుట్ల గ్రామాలలో పర్యటించారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఈఆర్వో రజినికుమారి, డీటీ ఫణీంద్రకుమార్, వీఆర్ఓలు టి.జీరయ్య, కోటేశ్వరరావు, రంగారావు, రాజు, సునీత, కిరణ్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ హఫీజుద్దీన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

- ఈనెల 25వరకు గడువు
- డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25శాతం సీట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాల వద్ద హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న(అనాథలు, హెచ్ఐవీ బాధిత, దీర్ఘకాలిక వ్యాధులు) పిల్లలకు 5శాతం, ఎస్సీ 10, ఎస్టీ 4, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలకు 6 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ.1.44 లక్షలు వార్షిక ఆదాయం కలిగి ఉండాలని తెలిపారు. ప్రవేశాల కోసం విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, నివాస గుర్తింపు కార్డు, విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని చెప్పారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదనీ, ఉచిత విద్యనందించనున్నట్లు వివరించారు. దరఖాస్తు చేసుకునేవారు తమ నివాసానికి ఒకటి నుంచి మూడు కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంఈఓ కార్యాలయం, సమీపంలోని మీ–సేవా, ఇంటర్నెట్ సెంటర్ల నుంచి htt pr://cre.ap.gov.in/rte/ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రతీ వాహనం తనిఖీ చేస్తాం

- గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ ఎండీ మహబూబ్‌బాషా
- హైవేపై అంతర్‌జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు



చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్ బాషా

ప్రత్తిపాడు: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందని గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ ఎండీ మహబూబ్‌బాషా తెలిపారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెంలోని పదహారవ నంబరు జాతీయ రహదారిపై గుంటూరు పల్నాడు జిల్లాల మధ్య గుంటూరు–చిలకలూరి పేట మార్గంలో అంతర్‌జిల్లా చెక్‌పోస్టును మంగళవారం ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టును గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ ఎండి. మహబూబ్‌బాషా, ట్రైనీ డీఎస్పీ గీతలు పరిశీలించారు. వాహనాలను నిలిపి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు చెక్‌పోస్టు ఉంటుందని, ఇరవై నాలుగు గంటలూ సిబ్బంది తనిఖీలు చేస్తారని చెప్పారు. ఏ ఒక్క వాహనాన్ని వదలకుండా తనిఖీలు చేసే విధంగా ఆదేశాలిచ్చామని చెప్పారు. అక్రమ మద్యం, నగదు, బంగారం .. వంటి వాటిని నిరోధించేందుకే చెక్‌పోస్టును ఏర్పాటు చేశామని చెప్పారు. ఏమైనా పెద్ద మొత్తంలో వస్తువులను తరలించే సమయంలో కచ్చితంగా సంబంధిత సరుకుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. వెంట నోడల్ ఆఫీసర్, ప్రత్తిపాడు సీఐ నిసార్‌బాషా, ఎస్ఐ సోమేశ్వరరావు తదితరులున్నారు.

దాడికి పాల్పడిన నిందితుడు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రభుత్వ అధికారుల విధులను అడ్డగించి వారిపై భౌతికంగా దాడిచేసి దుర్భాషలాడిన సంఘటనలో నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ డి నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గోరంట్ల ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలోని మైత్రినగర్ 1వ లైనులో నగర మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీప్లానర్ పొట్టేలి మురళి అతని సిబ్బంది సంఘటన స్థలికి చేరుకున్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టరాదని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన గోరంట్లకు చెందిన తాళ్ళ కిషోర్‌కు తెలియపరిచి నోటీసును ఇచ్చే ప్రయత్నం చేయగా కిషోర్ వారిపై దాడికి పాల్పడి అసిస్టెంట్ సిటీ ప్లానర్‌ను కొట్టి, తనతోపాటు వచ్చిన సిబ్బందిపై దాడిచేసి దుర్భాషలాడి ఎవరైనా స్థలం జోలికి వస్తే చంపేస్తానని బెదిరించాడని మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

బాపట్లటౌన్: కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి మరియదాస్ కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాలతో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలపై డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ ఉద్యోగులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను తమకు వివరిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కూరపాటి సత్యంరాజు మాట్లాడుతూ శాఖా పరమైన సమస్యలపై సత్వరమే స్పందించి ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలని, మిగిలిఉన్న కాంట్రాక్టు సిబ్బంది అందరికీ నూరు శాతం మూలవేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బడుగు శివాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

150 కేజీల బరువు తీర్చిన రోబోటిక్

- గుంటూరు సాయిభాస్కర్‌లో రోగికి రోబోటిక్ సర్జరీతో మోకీలు మార్పిడి
- నూరు శాతం ఫలితాలు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: అధిక బరువున్న వ్యక్తులకు మోకీలు మార్పిడి ఆపరేషన్లలో రోబోటిక్ సర్జరీలు నూరుశాతం మేలు చేస్తాయని గుంటూరు సాయిభాస్కర్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్ అధినేత, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి వెల్లడించారు. మంగళవారం గుంటూరు అరండల్‌పేటలోని ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిక బరువున్న వ్యక్తులకు సాధారణంగా మోకీలు మార్పిడి ఆపరేషన్ చేసేందుకు చాలా మంది వైద్యులు వెనుకడుగు వేస్తారని పేర్కొన్నారు. అధిక బరువు ఉన్నవారు మోకీలు సమస్యలతో జీవితాంతం బాధపడే పనిలేకుండా వారి శరీర బరువు తగ్గకపోయినా రోబోటిక్ సర్జరీలతో సాధారణ జీవితాన్ని గడపవచ్చని చెప్పారు. కృష్ణాజిల్లా గంపలగూడేనికి చెందిన 55 ఏళ్ల కేతేపల్లి మురళీకృష్ణ ఆరేళ్లుగా కుడికాలు నొప్పి, కాలు వంకరపోయి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని డాక్టర్ నరేంద్రరెడ్డి చెప్పారు. గత నెల 27న తమ ఆస్పత్రికి ఆయన తమ ఆస్పత్రికి వచ్చారని, సుమారు 150 కిలోల బరువు ఉండి కుడి మోకీలు పూర్తిగా అరిగిపోయి, పూర్తిగా విల్లులాగా వెనక్కి వంగిపోయి ఉన్న విషయాన్ని గుర్తించామన్నారు. దీంతో గత నెల 29న రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేశామన్నారు. ఆపరేషన్ విజయవంతమవడంతో మంగళవారం కుట్లు ఓపెన్ చేస్తున్నామని వెల్లడించారు. అధిక బరువున్న వారికి రోబోటిక్ సర్జరీలు ఎంతో ఉపయోగపడతాయని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా నేడు వినియోగంలో ఉన్న రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వైద్య సాంకేతిక పరిజ్ఞానాన్ని గుంటూరు ప్రజల కోసం తమ హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. తమ హాస్పిటల్‌లో 300 మందికి పైగా రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు విజయవంతంగా చేశామన్నారు.

రైలు ప్రయాణికులను బెదిరించే ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ ఎస్ఐ సరస్వతి, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీ బేగ్

తెనాలిరూరల్: ప్రయాణికులను బెదిరించి డబ్బులు దండుకుంటున్న ఎనిమిది మంది సభ్యుల ముఠాను ఆర్‌పీఎఫ్, జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి జీఆర్పీ ఎస్ఐ ఎల్.సరస్వతి, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతేఅలీ బేగ్ మంగళవారం వివరాలు వెల్లడించారు. రైళ్లలో సెల్‌ఫోన్‌లకు ఇయర్‌ఫోన్‌లు, ఇతర పరికరాలు అమ్ముకునేందుకు రైల్వే శాఖ కొన్ని ఏజెన్సీలకు కాంట్రాక్ట్ ఇచ్చింది. ఇందుకోసం ఏజెన్సీలు నియమించుకునే విక్రయదారులు రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు చెల్లిస్తే రైళ్లలో తిరుగుతూ ఈ పరికరాలను విక్రయించుకునేందుకు రైల్వే శాఖ సదరు ఏజెన్సీల ద్వారా అనుమతులిస్తుంది. ఈ క్రమంలో విజయవాడ వైఎస్సార్ నగర్‌కు చెందిన కొందరు యువకులు విక్రయదారుల అనుమతులు తీసుకున్నారు. నిబంధనల ప్రకారం రాత్రి ఎనిమిది గంటల వరకే వీరు రైళ్లలో విక్రయాలు చేస్తుండాలి. విజయవాడ యువకులు విక్రయాలు జరుపుతున్నట్టుగా అర్ధరాత్రి వేళల్లోనూ రైళ్లలోని జనరల్ బోగీలలోకి ఎక్కి ప్రయాణికులను బెదిరించి వారి నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు అదనపు ఆదాయం కోసం ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. దీనిపై జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అప్రమత్తమైన తెనాలి పోలీసులు రైళ్లలో నిఘా ఉంచారు. ఎర్నాకుళం–టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికులను బెదిరిస్తున్న ఎనిమిది మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. యువకులందరూ ఒకే ప్రాంతానికి చెందిన చెందిన వారని, చెడు వ్యసనాలకు బానిసలై దోపిడీలకు పాల్పడుతున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్టు అధికారులు తెలిపారు. సమావేశంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ ఎం.శివరామకృష్ణయ్య, హెడ్‌కానిస్టేబుళ్లు మూర్తి, శివప్రసాద్, రామకృష్ణ ఉన్నారు.